"బాయ్ ఫ్రెండ్‌ను మీట్ అవ్వడానికేమో" అన్నాను.

"ఏముందే ఆ బుర్రలో!"

"చూచుకోలేదుగాని, చెప్పవోయ్!" అన్నాను.

"తిన్నది అరగడానికి నడుస్తుంది తెలుసా?" అన్నది. నవ్వేసాను. మర్నాడు లాబ్ నుండి వస్తుంటే హేమచంద్ర కనిపించాడు. నన్ను చూచి ముఖం చాటుచేసుకోబోయాడు. పిలిచాను.

"నాకు పని వుందండి" అన్నాడు. నాకు నవ్వు వస్తుంది. వచ్చే నవ్వును ఆపుకున్నాను.

"ఇంతకీ నిన్న హోటల్ బిల్ పే చేసారా?"

"చెయ్యకపోతే వాడు వదులుతాడా?" అన్నాడు ముఖం గంటుపెట్టుకుని.

"డబ్బు సరిపోలేదన్నారు. సారీ మేం వుండి యివ్వలేకపోయాం" అన్నాను. అతను తన యెడమచేయి చూపి వెళ్ళిపోయాడు. చాలా సేపటికి అర్థం అయింది వాచి లేదని. పాపం జాలీ మనసులు ఖాళీ జేబులు అనుకున్నాను. □

---

మినీ కథ:

# వాచీ

కృపానందం తిట్టుకున్నాడు. పాడు వాచీ!

అందరి టైములూ పదిగంటలయితే తన వాచీ ఎనిమిదిన్నర చూపిస్తోంది. రాత్రి పండుకోబోయే ముందే సరిచేశాడు కృపానందం. అంతే షుమారుగా గంటకి అయిదు నిమిషాలు స్లో నడుస్తోంది.

కృపానందానికి పెళ్ళిలో అయిదు సంవత్సరాలనాడు మామగారు చదివించిన వాచీ అది. చదివించిన మూడో నాటికే వాచీ తప్పుగా తిరుగుతోన్నట్టు రూఢీ అయిపోయింది కృపానందానికి.

రిపేరరు వాచీ చూచి, పెదిమ విరచి, "కేసు కొత్తదండి. మిషను ఈనాటిది కాదు" అన్నాడు.

కృపానందం తన మామగారిమీద గుంయ్ మనలేక భార్యమీద కంయ్ మన్నాడు.

భార్య కొత్తలోనే గుంయ్ గుంయ్ లాడింది. అప్పట్నించీ భార్యతోనూ వాచీతోనూ సరిపెట్టుకుంటూ వస్తున్నాడు కృపానందం.

ఉదయం లేస్తూనే గంటకి అయిదు నిమిషాలు చొప్పున లెక్కగట్టి ఆఫీస్ టయిముకి 25 నిమిషాలు ముందుకి నెట్టాడు.

ఈ వాచీ మూలంగా రోజూ మేనేజర్‌తో చీవాట్లు తినకుండా ఈ పద్ధతినే శాశ్వతంగా అమలుజరపాలనికూడా నిశ్చయించుకున్నాడు. తను రోజూ లేచేమరి!

సరిగ్గా 10 గంటలకి ఆఫీసుకు బయలు దేరాడు. అతనికి తృప్తిగా వుంది. సరిగ్గా పావు గంటలో బస్‌స్టాండుకు, మరో పావుగంటకి ఆఫీసుకి చేరుకోవచ్చును.

అన్ని సక్రమంగా ముగిసి ఆఫీసుకి చేరాడు. కాని కృపానందానికి చీవాట్లు తప్పలేదు.

అతడి వాచీ 10.30 చూపిస్తోంటే ఆఫీస్ టైం 10.50 లో వుంది. మేనేజర్ చెడతిట్టాడు.

కృపానందం ఏడుపు బిగబెట్టుకుని సీట్లో కూలబడ్డాడు.

"చూడు .... మీ నాన్న యిచ్చిన వాచీ!" అన్నాడు భార్యతో సాయంకాలం ఇంటికి వెళ్ళగానే.

"ఏమయింది? ఉదయం టైము సరిచేశానే! స్పీడుగా పోతోంటే" అన్నది భార్య.

కృపానందం కసిగా చూసి, "నీకు అంత దయ ఈనాడు నా వాచీమీద ఎందుకు పుట్టుకు వచ్చింది?" అన్నాడు.

—ఎం. వి. వి. సత్యనారాయణ